

శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో చండీహోమం

## శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో చండీహోమం

**బేగంపేట మార్చి 14, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు. హోమంలో పాల్గొనేందుకు జంట నగరాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని అనంతరం హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కామేశ్వర్, మాజీ ధర్మ కర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీతో పాటు అన్నదాన సంతర్పణ చేసారు.

# హైదరాబాద్ వార్త

# టారిఫ్ మారితే ..జీరో బిల్లు కట్ ..!

- *భారీగా పెరుగుతున్న గృహ విద్యుత్ వినియోగం
- *గిర్రున తిరుగుతున్న ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు
- *గ్రేటర్‌లో 60 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు
- * ప్రస్తుతం 10 లక్షలకు పైగా కనెక్షన్లకు గృహజ్యోతి వర్తింపు



**హైదరాబాద్, మార్చి 14,ప్రభాతవార్త:** శివరాత్రి తర్వాత చలి తీవ్రత తగ్గిపోయింది. పగటిఉష్ణోగ్రతలు ఇప్పటికే 35 డిగ్రీలు దాటింది. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్క పోత తోడైంది. ఉపశమనం కోసం సిటిజన్లు పేద, మధ్య తరగతి కుటుంబాలు సైతం ఏసీలు, కూలర్లు కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటికే రిఫ్రిజిరేటర్, వాటర్ హీటర్, మిక్సీ, టీవీ, ఫ్యాన్ వాడకంతో నెలకు 120 నుంచి 150 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించేవారు.. తాజాగా ఏసీలు, కూలర్లు వినియోగించనుండటంతో మీటర్ రీడింగ్ గిర్రున తిరుగుతుంది. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ప్రభుత్వం 2024 మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లులు(గృహజ్యోతి పథకం) జారీ చేస్తున్న విషయం తెలిసిందే. గ్రేటర్లో 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 10,03,286 కనెక్షన్లు మాత్రమే జీరో బిల్లుకు అర్హత పొందారు. వీరు ప్రతి నెలా 89.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ఇందుకు సంబంధించిన రాయితీ మొత్తం రూ.38.62 కోట్లు ప్రభుత్వం డిస్కంకు చెల్లిస్తోంది. ఇక నుంచి రోజువారీ విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టకపోతే...నిర్దేశిత టారీఫ్ దాటి ఇప్పటివరకు పొందిన జీరో బిల్లును కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**పొదుపుగా వాడితేనే..**

ప్రస్తుతం అన్ని ఇళ్లల్లో ఎల్ఈడీ బల్బులు వినియోగిస్తున్నారు. ఇప్పటికీ కొందరు పాతకాలం ఫ్లోరోసెంట్ ట్యూబ్‌లైట్లే వాడుతున్నారు. వీటి సామర్థం 40 వాట్స్ ఉండడంతో విద్యుత్ విని యోగం మరింత పెరిగే అవకాశముంది. దీని దృష్ట్యా ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు మేలు. ఏసీలు 24 నుంచి 29 డిగ్రీల మధ్య ఉపయోగిస్తేనే చల్లదనంతో పాటు బిల్లు ఆదా అవుతుంది. ప్రస్తుతం మార్కెట్ లో ఇన్వర్టర్‌తో కూడిన ఏసీలు అందుబాటులో ఉన్నాయి. గది చల్లబడగానే ఆటోమెటిక్‌గా ఏసీ ఆగిపోతుంది. వీటితో కొంత విద్యుత్తు వినియోగం తగ్గే అవకాశముంది. సాధారణ ఏసీలు కరెంటు పోయి వచ్చినప్పుడు పునఃప్రారంభమయ్యే సమయంలో లోడ్ పెరిగిపోతుంది. ఇది విద్యుత్తు సరఫరా వ్యవస్థపై భారంపడుతుంది. వేసవికి ముందే ఏసీలను మెకానిక్‌తో తనిఖీ చేయించాలి. ఫిల్టర్లు శుభ్రం చేయించడంతోపాటు గాలి ఫ్లోటింగ్‌ను పరిశీలించాలి. సీజన్ మేరకు ఫ్రిజ్‌లో ఫ్రీజర్ దశలు మారుస్తూ ఉండాలి. వేసవిలో ఎక్కువ ఉంచినా మిగిలిన కాలాల్లో తగ్గించుకోవాలి.మంచు పొరలు పావు వంతు పెరిగినట్లు గమనిస్తే వెంటనే డీఫ్రాస్ట్ అనే ఆప్షన్‌తో తొలగించాలి.

ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు, ఎల్ఈడీ బల్బులు, రిఫ్రిజిరేటర్లు తదితర విద్యుత్తు గృహోపకరణాలు బీఈఈ రేటింగ్ 1 నుంచి 5 స్టార్లతో విక్రయిస్తున్నారు. వీటిలో 5 స్టార్ ఉంటే విద్యుత్ వినియోగం తగ్గి బిల్లు ఆదా అవుతుంది. అవసరం లేని సమయంలో కంప్యూ టర్లు, టీవీలు, ఫ్యాన్లు స్విచ్ఛాఫ్ చేయాలి. ఫోన్ ఛార్జింగ్ పూర్తయ్యాక ఛార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి.

# ఉరిమే ఉత్సాహం..








## రంగు పడే..మది మురిసే

**హైదరాబాద్, మార్చి 14 ప్రభాతవార్త**

హోలీ..రంగుల కేళీ. నగరంలో హోలీ ఉత్సవాలు మురిపెంగా సాగాయి. రంగుల హరివిల్లులు.. కేరింతల నడుమ హోలీకేళి కొనసాగింది. శుక్రవారం వేడుకలు ధూంధాంగా జరిగాయి. క్లబ్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్లు, రిసార్టులు, ఫంక్షన్ హాళ్లలో రంగులు సందడి కనిపించింది. సెలబ్రిటీ డీజేలు, పలువురు సినీతారలు వేడుకల్లో భాగస్వామ్యం అయ్యారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని డీజే ధనుల నడుమ సంగీతానికి లయబద్ధంగా నృత్యాలు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. కాలనీలు, బస్తీలలో అనేక ప్రాంతాలలో హోలీ ఫుల్ జోష్‌లో ఆడారు.ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబురాల్లో మునిగితేలారు. యువత, చిన్నాపెద్దా కేరింతలు కొట్టారు. అందరూ రంగుల్లో మునిగితేలారు. అంతా ఇంద్రధనుస్సు వర్ణాలలో తడిసి ముద్దయ్యారు.ఆనందోత్సవాల మధ్య హోలీ వేడుకలను జరుపుకున్నారు. మరి కొందరు మిఠాయిలు పంచుతూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.





# 20 నుంచి సెపక్ తక్రా వరల్డ్ కప్ 2025

### పాల్గొననున్న 20 దేశాల మహిళలు, పురుషుల జట్లు



సెపక్ తక్రా వరల్డ్ కప్ 2025 పోటీలకు ఈటల రాజేందర్‌ను ఆహ్వానిస్తున్న ప్రేంరాజ్, సురేశ్

**హైదరాబాద్, మార్చి 14 ప్రభాతవార్త:** ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు బీహార్ రాష్ట్ర రాజధానిలో సెపక్ తక్రా వరల్డ్ కప్ 2025 పోటీలు జరుగుతాయని ఇంటర్నేషనల్ సెపక్ తక్రా ఫెడరేషన్ వైఎస్ ప్రెసిడెంట్ ఎస్ఆర్ ప్రేం రాజ్, సెపక్ తక్రా అసోసియేషన్ ఆల్ ఇండియా సెక్రటరీ, స్టేట్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్ వివరించారు. పాట్నాలోని పాటలీపుత్ర స్టేడియంలో మార్చి 25వరకు పోటీలు జరుగుతాయని, ప్రపంచంలోని 20 దేశాల మహిళలు, పురుషుల జట్లు పాల్గొంటున్నాయని, ఈ పోటీలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ప్రారంభిస్తారని, తెలంగాణ రాష్ట్రం నుంచి మల్కాజిగిరి లోకసభ సభ్యుడు ఈటెల రాజేందర్ హాజరవుతారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 20 దేశాల నుంచి మహిళలు, పురుషుల జట్లు పోటీపడబోతున్నాయని అన్నారు. దేశంలో సెపక్ తక్రాకు పెరుగుతున్న ప్రజాదరణ ప్రాముఖ్యతను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. టీమ్ ఈవెంట్, రేగు ఈవెంట్, డబుల్ ఈవెంట్, క్వాడ్ ఈవెంట్ నాలుగు విభాగాలలో మ్యాచ్ లను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రత్యేకమైన క్రీడలో అథ్లెట్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, పోటీ స్ఫూర్తిని పెంపొందించడానికి ఒక వేదికను అందించడం ఈ ఛాంపియన్షిప్ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఛాంపియన్‌షిప్ నిర్వహణలో ఇంట ర్నేషనల్ సెపక్ తక్రా ఫెడరేషన్, ఆల్ ఇండియా అసోసియేషన్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా సురేష్ ప్రశంసించారు.ఈ పోటీలకు సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం దేశానికి గర్వకారణమనీ, ఇది మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుం దని సురేష్ అన్నారు.

## -పండుగలు పరస్పరం సోదరభావాన్ని పెంపొందిస్తాయి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి

**గోషామహల్, మార్చి 14 ప్రభాతవార్త:** పండుగలు పరస్పరం సోదర భావాన్ని పెంపొందిస్తాయని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యరెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో కౌబాయ్ ప్రొడక్షన్, నిర్వాహకులు సప్పడి రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో హోలీ సంబురాలు నిర్వహించారు. వేడుకల్లో ఆమె పాల్గొన్ని మాట్లాడుతూ జీవితంలో హోలీ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. రకరకాల రంగుల వలె అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ ఆర్థిక సౌలభ్యం సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నగర శివారు ప్రాంతాలనుంచి వందలాది యువతీ, యువకులు మహిళలు పెద్దఎత్తున్న పాల్గొన్ని రంగులు చల్లుకున్నారు



హోలీ వేడుకల్లో పాల్గొన్న కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యరెడ్డి

## హోలీ వేడుకల్లో గంజాయితో తయారు చేసిన కుల్ఫీ, ఐస్‌క్రిమ్ పట్టుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్

**అఫ్జల్‌గంజ్, మార్చి 14 ప్రభాతవార్త:** హోలీ వేడుకల్లో గంజాయితో తయారుచేసిన కుల్ఫీ,ఐస్‌క్రీమ్‌తోపాటు గంజాయిబాల్స్‌ను అమ్మకాలు చేస్తున్న ముఠాను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. హోలీ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ మహానగరంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు విభిన్న రీతిలో హోళీ సంబురాలు చేసు కుంటారు. లోయర్ దూల్‌పేట్‌లోని మచిలిపురాలో కుల్ఫీ, ఐస్‌క్రీమ్, బర్ఫీ, స్వీటులో సీల్వర్ కోటెడ్ బాల్స్‌లో గంజాయి వినియోగిస్తూ సంబురాలు జరుపుకొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టిఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. 100 కుల్ఫీ, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కొటెడ్ బాల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుల్ఫీ, ఐస్‌క్రీమ్ విక్రయించే సత్యనారాయణసింగ్, గంజాయితో వీటిని తయారులు చేసినట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి బర్ఫీ, చాకెట్లను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి అభినందించారు.

## అక్రమ మద్యం విక్రయిస్తున్నవారిపై కేసు నమోదు

### మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం విక్రయిస్తున్నవారినుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**చిక్కడపల్లి, మార్చి 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసిన సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. హోలీ పండుగల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం షాపులను మూసివేయాలని స్పష్టమైన ఆదేశాలున్నా కూడా కొంతమంది బ్లాక్‌లో మద్యాన్ని అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు బాగ్‌లింగంపల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న అంబర్‌పేటకు చెందిన జావీద్‌ఖాన్,, అచ్చయ్యనగర్‌కు చెందిన సయ్యద్ సాజిద్, బాగ్‌లింగంపల్లికి చెందిన కుమ్మరి శివకుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద 24 క్వార్టర్ బాటిల్స్(విస్కీ), 53 క్వార్టర్ బాటిల్స్(విస్కీ)లను స్వాధీనపరచుకొని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ పర్యవేక్షణలో అడ్మిన్ ఎస్ నాగరాజు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

## హీరో బాలకృష్ణ ఇంటి ఫెన్సింగ్‌ను ఢీకొట్టిన కారు

**పంజగుట్ట, మార్చి 14 (ప్రభాతవార్త):** టాలీవుడ్ సీనియర్ నటుడు నందమూరి బాలకృష్ణ ఇంటి ముందు శుక్రవారం తెల్లవారుజామున ఓ కారు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 1లో వేగంగా వచ్చిన ఓ కారు బాలయ్య ఇంటి ముందున్న ఫెన్సింగ్‌ను ఢీకొట్టింది. కారు మాదాపూర్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్45 మీదుగా చెక్ పోస్ట్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బాలకృష్ణ ఇంటి ముందున్న ఫెన్సింగ్‌తో పాటు కారు ముందు భాగం ధ్వంసమయ్యాయి. అయితే, డ్రైవర్ అతివేగంతో పాటు నిద్రమత్తే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదం గురించి పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా ప్రమాదం చేసిన వారిని ఇప్పటికే గుర్తించారు. అతివేగంగా కారు నడిపి ప్రమాదం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## లలిత జ్యువెలరీలో బంగారం మాయం

**పంజగుట్ట, మార్చి 14 ప్రభాతవార్త:** లలిత జ్యువెలరీలో బంగారం మాయమైన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. శుక్రవారం లలిత జ్యూయలరీ షాప్‌కు ఓ ఆగంతకుడు బంగారు నగలు కొనడానికి వచ్చాడు.ఆ సమయంలో షాపు సేల్స్‌మెన్ బంగారు కాయిన్‌లు చూపించాడు.ఈ సమయంలో ఆగంతకుడు బంగారు కాయిన్ స్థానంలో వెండి బిళ్ళకు బంగారు పూత పూసి మోసం చేశాడు. తర్వాత విషయం తెలుసుకున్న షాపు వారు సీసీ కెమరాలో చూడగా బంగారం బయట పడింది. దీంతో ఈ విషయమై పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ పుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**పేట్‌బషీరాబాద్, మార్చి 14, ప్రభాతవార్త :** బైసాకి దాబా ముందు గుర్తు తెలియని వాహనం ఢీకొని టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న ఒరిస్సాకు చెందిన ప్రకాష్ సాహు(25) మృతి చెందినాడు. ఆక్సిడెంట్ శుక్రవారం సుమారు 3:30 గంటల సమయంలో జరిగింది. మృతుడు ఒరిస్సా నుండి మూడు సంవత్సరాల క్రితం హైదరాబాద్ వచ్చి లేబర్‌గా పనిచేస్తున్నాడు. మృతిని భావ ఫిర్యాదు మేరకు పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పల్లవి రెస్టారెంట్‌లో భారీ అగ్ని ప్రమాదం

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 14, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజూమున వివేకానంద నగర్‌లోని పల్లవి రెస్టారెంట్లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రెస్టారెంట్లో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు.. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించారు. మంటలు చెలరేగడానికి గల కారణాలపై ఆరా తీశారు. రెస్టారెంట్లో కస్టమర్లు లేని సమయంలో అగ్ని ప్రమాదం జరగడంతో పెను ప్రమాదంతో తప్పింది. దీంతో అధికారులు, రెస్టారెంట్ యజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం భారీగానే జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



వివేకానంద నగర్‌లోని పల్లవి రెస్టారెంట్లో అగ్నిప్రమాద దృశ్యం

# ఎండలు.. జర జాగ్రత్త

- పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను వదిలేయవద్దు
- ఎండాకాలంలో వాహనాల్లో వేడి ప్రమాదకరం
- మధ్యాహ్నం 12-3 గంటల మధ్య బయటకు రావద్దు
- దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా నీరు తాగాలి

**హైదరాబాద్, మార్చి 14 ప్రభాతవార్త**

తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వడగాల్పుల సమయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా పలు సూచనలు చేస్తున్నారు. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు తాగాలని, దాహం వేసేవరకు వేచిచూడడం మంచి సూచిక కాదని పేర్కొంటున్నారు. పార్క్‌చేసిన వాహనాల్లో పిల్లలను లేదా, పెంపుడు జంతువులను వదిలి వెళ్లవద్దనీ, వాహనం లోపల ఉష్ణోగ్రత ప్రమాదకరంగా మారవచ్చని హెచ్చరిస్తున్నారు. బయటకు వెళ్లేప్పుడు తాగునీటిని వెంట తీసుకెళ్లాలి. ఓరల్ రీహైడ్రేషన్ సాల్యూషన్(ఓఆర్ఎస్)ను వినియోగించాలి. నిమ్మరసం, మజ్జిగ, లస్సీ వంటి ఇంట్లో తయారుచేసిన పానీయాలు, ఉప్పు కలిపిన పండ్ల రసాలను తీసుకోవాలి. పుచ్చ, కర్బూజ, ఆరెంజ్, ద్రాక్ష, వంటి అధిక నీటి కంటెంట్ ఉన్న సీజనల్ పండ్లు, కూరగాయలను తినాలి.అలాగే పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు తినాలని సూచించింది. సన్నని వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించడం మంచిది. గొడుగు, టోపీ, టవల్ వంటి ఇతర సాంప్రదాయ పద్ధతుల్లో తలను ఎండ వేడి నుంచి రక్షించుకోవాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు బూట్లు లేదా చెప్పులు తప్పనిసరిగా ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- బాగా వెంటిలేషన్ ఉన్న చల్లని ప్రదేశాల్లో ఉండాలి. ప్రత్యక్ష సూర్యకాంతి, వేడిగాలులను నిరోధించాలి.పగటిపూట కిటికీలు,కర్టెన్లను మూసి ఉంచాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- అనారోగ్యంతో ఉన్నవారు ఎండాకాలంలో ఇతరులకన్నా ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. వీరు అదనపు శ్రద్ధతీసుకోవాలి. ముఖ్యంగా శిశువులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఆరుబయట పనిచేసే వ్యక్తులు, మాన సిక వ్యాధి ఉన్న వ్యక్తులు, శారీరకంగా అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు, గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒంటరిగా నివసించే వృద్ధులు లేదా అనారోగ్యంతో ఉన్న వారి ఆరోగ్యాన్ని ప్రతి రోజూ పర్యవేక్షించాలి.
- శరీరాన్ని చల్లబరచడానికి ఫ్యాన్, తడిబట్టలను ఉపయోగించాలి.
- మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటకు రావొద్దు. ఒకవేళ వచ్చినా ఎండలో శారీరకమైన కఠినమైన పనులు చేయకూడదు.
- తీవ్రమైన ఎండ సమయంలో వంట గదిలో వంట చేయకూడదు. ఒకవేళ చేయాల్సి వస్తే వంటిల్లు వెంటిలేషన్ ఉండాలి, వెంటిలేట్ చేయడానికి తలుపులు, కిటికీలను తెరవాలి.
- ఆల్కహాల్, టీ, కాఫీ, శీతల పానీయాలు, పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను తీసుకోకూడదు. ఇవి శరీర ద్రవాన్ని కోల్పోవడానికి లేదా కడుపు తిమ్మిరికి కారణం కావచ్చు.
- ఆరు బయట పనిచేసే కార్మికుల కోసం పని ప్రదేశంలో చల్లని తాగునీటిని దుబాటులో ఉంచాలి. ప్రతి 20 నిమిషాలకు ఒక గ్లాసు నీరు తాగాలని వారికి చెప్పాలి.
- సాధారణ మానవ శరీర ఉష్ణోగ్రత 97.5ని ఫారిన్‌హీట్ నుండి 98.9ని ఫారీన్ హీట్ ఉండాలి.



## జగదీశ్వర్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

### మాదిగ హక్కుల దండోరా

**గన్‌ఫౌండ్రి, మార్చి 14ప్రభాతవార్త:** అసెంబ్లీ సాక్షిగా స్పీకర్‌గా దళితుడు ఉన్నందుకే అనుచిత వ్యాఖ్యాలు చేస్తూ స్పీకర్ పదవిని అనుమానించిన మాజీ మంత్రి ప్రస్తుత శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్వర్‌రెడ్డిని వెంటనే శాసనసభ పదవిని నుంచి బర్తరఫ్ చేయాలని మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్‌మాదిగ డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానన అని చెప్పి చేయకుండా మాట తప్పినచరిత్ర బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ది అన్నారు.ప్రస్తుతం స్పీకర్ పదవిలో ఉన్నటువంటి దళితుడిన్ని స్పీకర్‌ను చులకన భావంతో సభా సంప్రాదాయాలను గౌరవించకుండా అవమానపర్చిన శాసనసభ్యులు జగదీశ్వర్‌రెడ్డిని చట్టసభలో ఉండే అర్హతలేదన్నారు.అధినేత కెసిఆర్ బాట లో బిఆర్ఎస్ శాసన సభ్యులు నడుస్తున్నారన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే శాసన సభ్యుడిగా జగదీశ్వర్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని దండు సురేందర్‌మాదిగ డిమాండ్ చేశారు.



హోలీవేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

## హోలీ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనడం అభినందనీయం : తలసాని

**అడ్డగుట్ట, మార్చి 14 (ప్రభాతవార్త):** చిన్నా, పెద్దా తేడా లేకుండా ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ హోలీ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని బండి మెట్‌లో బిఆర్‌ఎస్ నేత నాగులు ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో తలసాని పాల్గొని హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్‌కు చెందిన బిఆర్‌ఎస్ నాయకులు ఓదెల సత్యనారాయణ, శ్రీనాథ్, రాయి వెంకట్, మహేశ్ యాదవ్, అమర్ పాల్గొన్నారు.

### కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సిఎం రేవంత్‌రెడ్డిపై చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు

**చిక్కడపల్లి, మార్చి 14 (ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ముఖ్యమంత్రి రేవంద్‌రెడ్డి అనుచితమైన తీవ్ర వ్యాఖ్యలు చేశారని, ఆయనపై కేసు నమోదు చేయాల్సిందిగా బిఆర్‌ఎస్ యువనేత ముఠాజైసింహా నేతృత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌కు లిఖితపూర్వంగా ఫిర్యాదు చేశారు. ఈ నెల 12న రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగంలో భాగంగా మాజీ సీఎం కెసిఆర్‌ను ఉద్దేశించి 'స్ట్రెచర్ నుంచి స్ట్రెచర్‌కు వెళ్లారని రేపు 'స్ట్రెచర్ నుంచి మార్చురికి' వెళ్తారని పేర్కొన్నారని, ఈ తరహా ప్రసంగం తెలంగాణ సమాజంలో గొడవలకు దారితీసే విధంగా ఉందని పేర్కొన్నారు. ఇలా రెచ్చగొట్టే ప్రసంగం చేసిన సిఎం రేవంత్‌రెడ్డిపై తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, పోతుల శ్రీకాంత్, శివా ముదిరాజ్, దీన్ దయాళ్‌రెడ్డి, పున్న సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, ముదిగొండ మురళీ, టెంట్‌హౌజ్ శ్రీను, రామస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### నాటి పాటలలో సంగీత సాహిత్యం చిరస్మరణీయం



శారద అకునూరి (అమెరికా)ను సత్కరిస్తున్న ప్రముఖులు

**సైఫాబాద్, మార్చి 14 (ప్రభాతవార్త):** అలనాటి సినీ పాటలలో సంగీతం సాహిత్యం చిరస్మరణీయమని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు చెప్పారు. అమెరికాలో విదేశీ సంస్కృతికి అకర్షణ చెందకుండా పాత పాటలలోని మాధుర్యాన్ని తాను అస్వాదించి ఇక్కడ వారికి శారద అకునూరి అందిస్తున్నారని ఆయన కొనియాడారు. అమెరికాలో ఉన్న శారద ఆరు దశాబ్దాలకు పైబడి సంగీత దర్శకుల స్వర పరిచిన పాటలను ఎంచుకుని ఇక్కడ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్ థియేటర్స్, శారద అకునూరి (అమెరికా) సంయుక్త ఆధ్వర్యంలో 'స్వరకర్తలకు స్వర నీరాజనం' పేరిట 50, 60 దశకంలో పదిమంది సినీ దర్శకుల స్వరపరిచిన పాటలను శారద సహ గాయకులు బాలకామేశ్వర్‌రావు, రాము, రమణలతో కలిసి అలపించారు. శారద బాలకామేశ్వరరావు అలపించిన చిరు నవ్వులోని హాయ్ పాటకు శ్రోతలు ప్రశంసల వర్షం కురిపించారు. సాంస్కృతిక పోషకుడు బొల్లినేని కృష్ణయ్య తన అభినందనలను తెలియజేశారు. వంశీరామరాజు స్వాగతం పలికి శారదను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొనగా సుధామయి వ్యాఖ్యనం చేశారు.

### వివిధ రంగాలవారిని సత్కరించడం అభినందనీయం

-తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల గద్దర్



టీవీ నటి దీపికకు పురస్కారాన్ని అందిస్తున్న గుమ్మడి వెన్నెల గద్దర్

**చిక్కడపల్లి, మార్చి 14 (ప్రభాతవార్త):** వివిధ రంగాలకు చెందిన వారిని గుర్తించి సత్కరించడం మంచి సంప్రదాయమని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల గద్దర్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో యువ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో భగవద్గీత గ్రంథాల ఆవిష్కరణ, స్త్రీశక్తి, సేవామూర్తుల పురస్కారాల ప్రదానోతసవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా వెన్నెల గద్దర్ హాజరై పురస్కారాలను అందించి గౌరవించారు. కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసు అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు రవీంద్రకుమార్, పాత్రికేయులు కె.సాయికుమార్ రెడ్డి, నిర్వాహక సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా హోలీ వేడుకలు

**మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 14 (ప్రభాతవార్త) :** హైదరాబాద్ పాతబస్తీ ఉప్పుగూడలో శుక్రవారం పాతనగర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు రంగులు చల్లుకుని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీ రాములు మాట్లాడుతూ ప్రజలు కలిసి మెలిసి ఎంతో ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతనగర మున్నూరు కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల శ్రీ రాములు, ప్రధాన కార్యదర్శి బిట్ల హంజరాజ్, ఉపాధ్యక్షులు దేవరశెట్టి ప్రభాకర్, కసరపు చంద్రకుమార్, పల్లె శ్రవణ్‌కుమార్, పోసు కృష్ణ, కోశాదికారి మామిడి నర్సింగరావు, సంఘం ప్రతినిధులు కిషన్‌రావు, శ్రీనివాసరావు, అల్లం భానుమూర్తి, ఆకుల ప్రభాకర్, బస్తీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హోలీ వేడుకల్లో పాల్గొన్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల శ్రీ రాములు, సంఘం ప్రతినిధులు



ఇందిరాపార్కు హోళీ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో వైభవంగా హోలీ ఉత్సవాలు



పాతబస్తీ గౌలిపురలో హోలీ మహోత్సవాలు



నకాష్ సంఘం ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించిన దృశ్యం



అడ్డగుట్టలో హోలీ సంబరాల్లో పాల్గొన్న కార్పొరేటర్ తదితరులు



చిక్కడపల్లిలో కామదహనం కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

# ఐకమత్యానికి, సమానత్వానికి ప్రతీక హోలీ

**ముషీరాబాద్, మార్చి 14, (ప్రభాతవార్త):** అందరం కలసి మెలసి ఆనందంగా జరుపుకునే హోలీ పండుగ ఐకమత్యానికి, సమానత్వానికి ప్రతీక అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ఇందిరా పార్కులో నిర్వహించిన హోలీ వేడుకలకు బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్ రచనశ్రీలతో కలసి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హోలీ అందరి జీవితాలలో ఆనందాన్ని నింపాలని, కష్టాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు రాంచందర్, ముచ్చకుర్తి ప్రభాకర్, బీజేపీ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో...**

**చార్మినార్, మార్చి 14 (ప్రభాతవార్త) :** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, లక్ష్మీగూడ, బాబుల్‌రెడ్డి నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలు శుక్రవారం హోలీ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శానిటేషన్ బృందం, ఎస్ఎఫ్ఐ, ఎంటమాజీ కార్మికులు పెద్ద సంఖ్యలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డిని కలిసి రంగులు చల్లి హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులతో కలిసి హోలీ సంబరాలను జరుపు కోవటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కాగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్దన్, బిజెపి నాయకులు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, బబ్లూరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రావుల భాస్కర్ కలిసి తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హోలీ ఉత్సవాలలో పాల్గొన్నారు.

**పాతబస్తీ గౌలిపురలో...**

**యాకుత్‌పుర, మార్చి 14 (ప్రభాతవార్త) :** యాకుత్‌పుర నియోజకవర్గం గౌలిపుర డివిజన్ పరిధిలో శుక్రవారం హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. యువకులు ముఖాలకు రంగులు చల్లుకుని కేరింతలు కొడుతూ హోలీ ఉత్సవాలలో పాల్గొన్నారు. హనుమాన్ నగర్‌లో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర బిజెవైఎం అధికార ప్రతినిధి శివ చంద్రగిరి మాట్లాడుతూ ప్రజలు ఎంతో భక్తి శ్రద్దలతో హోలీ ఉత్సవాలను జరుపుకుంటున్నారని తెలిపారు.

**రాష్ట్ర నకాష్ సంఘం ఆధ్వర్యంలో...**

**చిక్కడపల్లి, మార్చి 14 (ప్రభాతవార్త):** హోళి పర్వదినం పురస్కరించుకొని రాష్ట్ర నకాష్ సంఘం ఆధ్వర్యంలో హోలీ వేడుకలు శుక్రవారం రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఐకమత్యానికి ప్రతీకగా ఈ పండుగ జరుపుకున్నారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు, ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సహాయ కోశాధికారి ధనలకోట సతీష్, ఉపాధ్యక్షులు సంగు శ్రీనివాస్, హిమచందర్, డి. నర్సింగ్ రావు, కార్యదర్శులు రామగిరి శ్రీకాంత్, యం. శ్రీనివాస్, నాంపల్లి శ్రీకాంత్, ఎన్ .హెచ్. రామకృష్ణ, ఎమ్. శ్యామ్, చంద్రశేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

**ఘనంగా కామదహనం**

**చిక్కడపల్లి, మార్చి 14 (ప్రభాతవార్త):** చిక్కడపల్లిలో గురువారం రాత్రి కామదహనం మాజీ కార్పొరేటర్, టిడిపి నగర ప్రధానకార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కులాలు చదువుకుని పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామ్‌నగర్ డివిజన్ టిడిపి అధ్యక్షుడు డి.చంద్రమోహన్ గౌడ్, రమేశ్, శివకృష్ణ, సాగర్ పాల్గొన్నారు.

**అడ్డగుట్టలో...**

**అడ్డగుట్ట, మార్చి 14 (ప్రభాతవార్త):** హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్, శాంతినగర్, నార్త్‌లాలాగూడ పరిసర ప్రాంతాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నశ్రీనివాస్ ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నక్క మధు, లింగాని శ్రీనివాస్, వై.సత్తయ్యగౌడ్, పెండెం మనోహార్, మోహన్, అమర్, శివశంకర్, వడ్డెర ఎల్లయ్య, వసంత, మల్లేశ్, పొన్నాల రాజు, చారి, నర్సింహ, వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీగాయిత్రీ మాతా దేవాలయంలో మహా సంప్రోక్షణ

**శామీర్‌పేట, మార్చి 14, (ప్రభాతవార్త):** శ్రీగాయిత్రీ మాతా దేవాలయంలో మహా సంప్రోక్షణ పూజలు శుక్రవారం ప్రారంభమైనాయి. శామీర్‌పేట మండలం తూంకుంటలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో మహాసంప్రోక్షణ పూజా కార్యక్రమాన్ని మూడురోజులపాటు నిర్వహిస్తున్నారు. ఆలయంలో మహాగణపతి, శివపంచాయతన, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, రాఘవేంద్రస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట జరిగి రెండు దశాబ్దాల పూర్తి సందర్భంగ ఆలయంలో మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని, పరిపృత గాయత్రీ దేవాలయం మహాసంప్రోక్షణ కార్యక్రమం ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్‌విఎల్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు శ్రీరాఘవేంద్రస్వామి సేవా సమితి, సనాతన గురు సంప్రదాయ ప్రతి స్థానం వారి సంయుక్త నిర్వహణలో జరుగుతుందన్నారు. ఈ ఆదివారం వరకు ఆలయంలో జరిగే మహాసంప్రోక్షణ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

### రంగారెడ్డి జిల్లాలో హోలీ వేడుకలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, మార్చి 14 (ప్రభాతవార్త):** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. శుక్రవారంజిల్లాలోని ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రంగులు పూసుకుని కేరింతలు కొట్టారు. యువత డ్యాన్స్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. పట్టణాల్లో సామూహికంగా వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హోలీ సంబురాల్లో పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు.

**మహేశ్వరంలో..**

హోలీ వేడుకలను మహేశ్వరం నియోజవకర్గంలో ప్రజలు శుక్రవారం నాడు జరుపుకున్నారు. గ్రామాల్లో చిన్నా పెద్దా తేడాలేకుండా యువతీ, యుకులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరాలకు చాటిచెప్పేవి పండుగలని వివిధ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. ప్రతిపండుగకు ఒక ప్రత్యేక విశిష్టిత ఉందని తల్లిదండ్రులు నేటితరం పిల్లలకు పండుగల విశిష్టతను తెలియచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**నవాబుపేటలో...**

**నవాబుపేట మార్చి 14, (ప్రభాతవార్త) :** కలిమి లేమి ఎరెగని ఏకైక పండగా హోలీ, సమిష్టిగా సంబంరంగా జరుపుకునే అరుదైన పండగ హోలీని మండల ప్రజలు శుక్రవారం సంబురంగా జరుపుకున్నారు. ఎక్కడ ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జంగకుండా రంగుల కేళీ రంగోలీ హోలీని సంతోషంగా జరుపుకున్నారు. రాత్రి కాముని దహనం చేశారు. ఉదయం రంగులు చల్లుకుని పండగను ఆస్వాదించారు. వయోభేదం లేకుండా వేడుకల్లో పాల్గోన్నారు. తెల్లవారింది మొదలు చిన్నారుల కేరింతలతో రంగులు చల్లుకుని పండగను ఆస్వాదించారు. కొన్ని గ్రామాల్లో మద్యాహ్నం వరకు సంబురాలు జరుపుకోగా కొన్ని గ్రామాల్లో సాయంత్రం వరకు కాముని శవయాత్ర న్విహించి పోతరాజుల విన్యాసాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగుతూ అంగరంగ వైభవంగా వేడుకలను జరుపుకున్నారు.

### కష్టపడి చదివితే లక్ష్యాలను సాధిస్తాం

విజయ్ దేవరకొండ

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి14, (ప్రభాతవార్త):** మీరు ఎంచుకున్న లక్ష్య సాధనకొరకువందకువందశాతం కష్టపడితే ప్రపంచంలోని అత్యుత్త మమైనవి అన్నీమీ వద్దకు వస్తాయని సినీ నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. పోచారం మున్సిపల్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం రాత్రి సినర్జీ 2 కే 25 వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన అందరికీ మంచి భవిష్యత్తు ఉందని దానిని అనుభవించడానికి మనం బతికి ఉండి సాధించాలని అన్నారు. మనంఎంచుకున్న లక్ష్యసాధన కొరకు అడ్డదారులు వద్దని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని అన్నారు. అనురాగ్ యూనివర్శిటీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాననిఅన్నారు. తాను సినిమా రంగాన్ని ఎంచుకుని రాణించేందుకు తీవ్రంగా శ్రమిస్తానని అన్నారు. తనకు ఫ్యాన్స్ లేనప్పుడు విద్యార్థులే అండగా ఉండి ప్రోత్సహం అందించారని అన్నారు. అనురాగ్ యూనివర్శిటీలో చదివే విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే కళాశాల చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తమ కళాశాలలో చదివిన 1200 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంటు కల్పించామని అన్నారు. కళాశాలలో నాణ్యమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీనటుడు విజయ్‌కు జ్ఞాపికను యూనివర్శిటీ సీఈవో నీలిమ, రిజిస్టార్ అర్చన తదితరులు అందజేశారు.

### రాజకీయాల్లో ముస్లింలకు ప్రాతినిధ్యం : వసీం

**బొంరాస్‌పేట్, మార్చి 14, (ప్రభాతవార్త):** రిజర్వేషన్‌ల ప్రక్రియ ద్వారానే రాజకీయాల్లో ముస్లింలకు ప్రాతినిధ్యం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు వసీం అభిప్రాయాన్ని వ్యక్త పరిచాడు. శుక్రవారం మండల కేంద్రం లోనీ తన స్వగృహంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద పార్లమెంటరీ వ్యవస్థ కలిగి యున్న భారతదేశంలో సుమారు 18శాతం జనాభా కలిగిన మైనార్టీలకు రాజకీయాల్లో సరైన ప్రాతినిధ్యం ఇవ్వక అనర్హులకు ఇస్తుండడం దురదృష్టకరం అన్నాడు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో, చట్ట సభల్లో ముస్లిం మైనార్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించక పోవడంతీవ్రసమస్యగా ఆయన పరిగణించాడు. రాష్ట్రంలో అధికారంలోఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గ కూర్పులో ఎమ్మెల్సీ ఎంపికలో సైతం కేవలం ఒక్కటంటే ఒక్క అవకాశం కూడ ముస్లిం లకు ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాడు. రాజకియ అసమానతలు తొలగేలా, ప్రజాస్వామ్య బలోపేతంకోసం ముస్లింలు ఏకమై జనాభా ప్రాతిపదికన ప్రభుత్వాలు కల్పిస్తున్న రిజర్వేష న్ల కూడా దేశ వ్యాప్తంగా బలమైన సామాజిక వర్గంగాయున్న ముస్లిం లకు కూడా కల్పించేలా ఉద్యమించాలని పిలుపునిచ్చాడు.



పాతబస్తీ గల్లివీధి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు విష్ణుగౌడ్, సందీప్‌గౌడ్, సాయిగౌడ్ తదితరులు (చార్మినార్, ప్రభాతవార్త )

### ముగిసిన కురుక్షేత్ర..విజేతలకు బహుమతులు

**ఘట్‌కేసర్, మార్చి 14, (ప్రభాతవార్త):**

ఘట్‌కేసర్ మున్సిపల్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలో జరుగుతున్న జాతీయస్థాయి క్రీడా ఉత్సవం కురుక్షేత్ర-2025 ముగిసింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 120 కళాశాలల విద్యార్థులు కురుక్షేత్ర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కేపీఆర్ఐటీ కళాశాల విద్యార్థులు క్రికెట్, త్రోబాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి బహుమతులను అందుకున్నారు. వివిధ ఆటల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ-పిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎస్.దిలీప్ కురుక్షేత్ర జాతీయ పోటీలను ప్రారంభించగా క్రీడల నిర్వహణపై చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డిలు నిర్వాహకులను అభినందించారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమని, నిజమైన విజయం క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడంలోనే ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రీడావిలువలు, సమిష్టి చైతన్యం, శారీరక ఆరోగ్యాన్ని ప్రోత్సహించే విధంగా కురుక్షేత్రనిలిచిందని తెలిపారు. కేపీఆర్ఈఎస్ డైరక్టర్ డి.సుధీం ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర ఏక్లార్కర్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఓడిలు, పిజికల్ డైరక్టర్లు, అధ్యాపకులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

### నియంతృత్వ పోకడలు మానుకోవాలి

-బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

**ధారూరు, మార్చి 14, (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల ౧ అసెంబ్లీలో ప్రశ్నించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నానని బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ని ఉద్దేశపూర్వకంగాసభనుంచి సస్పెండ్ చేశారని, ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నియంతృత్వ పోకడల ౧అ నుసరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటివి మా నుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆయన తెలిపారు.

### హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్ రూరల్, మార్చి 14, (ప్రభాత వార్త) :**

షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా హోలీ వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించుకున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హోలీ వేడుకలకు హాజరై కార్యకర్తలు, జర్నలిస్టులు, ముఖ్య అనుచరులతో కలిసి ఆడిపాడి అదిరిపోయే స్టెప్పులతో అందరిని అకట్టుకుంది. జర్నలిస్టు కేపీ, తదితర అనుచరులతో ఎమ్మెల్యే హోలీ పండుగ జరుపుకోవడం పట్ల పలువురు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో జరుపుకున్న ఈ వేడుకలు తమకు జీవితాంతం గుర్తుండిపోతాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయంలో వచ్చిన ప్రతి ఒక్కరికి అంబలి తాపుతూ రంగులు పూస్తు అందరితో కలిసిమెలిసి సరదాగా ఉండటంతో క్యాంపు కార్యాలయం పండుగ వాతావరణంతో నిండిపోయింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు, కార్యకర్తలు, జర్నలిస్టులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా జాగ్రత్తగా వేడుకలను జరుపుకోవాలని, కెమికల్స్ కలిపిన రంగులకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జర్నలిస్టు కేపీ తదితరులు ఉన్నారు.

**వాడవాడలో హోలీ వేడుకలు...**

షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంతకుముందు రాత్రి కామదహన కార్యక్రమాలు ప్రతి పల్లెలో, మున్సిపల్ పరిధిలోని ప్రతి వాడలో నిర్వహించారు. అనంతరం ఉదయం తెల్లవారుజాము నుంచే చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఆహ్లాదకరంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు. అదేవిధంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు సహితం కార్యకర్తలతో కలిసి హోలీ వేడుకల్లో భాగస్వాములయ్యారు.

## చందానగర్ శివార్లలో 6.47 కేజీల గంజాయి పట్టివేత

**శేరిలింగంపల్లి, మార్చి 14 (ప్రభాతవార్త)**

శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని చందానగర్ శివారు ప్రాంతంలో జోరుగా కొనసాగుతున్న గంజాయి అమ్మకాలపై ఎస్‌టీఎఫ్ అధికారులు పంజావిసిరారు. శుక్రవారం ఎస్‌టీఎఫ్ అధికారుల దాడుల్లో దాదాపు నాలుగు లక్షల విలువ చేసిన 6.47కేజీల గంజాయిని పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి రైల్‌లో తీసుకువచ్చిన గంజాయిని ఆరుగురు వ్యక్తులు పంచుకుంటున్న సమయంలో ఎస్‌టీఎఫ్, టీం. బిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు బృందం కలిసి దాదాపు 93 గంజాయి పాకెట్లను కేజీ చొపుపన ఉండే రెండు గంజాయి బెండిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఐదు సెల్‌ఫోన్లతో పాటు నిందితులు విన్ని, బిక్షు, చంటి, క్రాంతి, నిఖిల్, సాయికిరణ్‌లను అరెస్ట్‌చేశారు. నిందితులతో పాటు గంజాయిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కాగా గంజాయిని పట్టుకున్న ఎస్‌టీఎప్ టీంలో సీఐ, ఎస్ఈలతో పాటు కానిస్టేబుల్స్ సంతోష్, యాదగిరి, హనీఫ్, లక్ష్మణ్, సాయికిరణ్, శంకర్‌లు ఉన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్‌రెడ్డితో పాటు టీం లీడర్ ప్రదీప్‌రావులు అభినందించారు.

ఐదు సెల్‌ఫోన్లు, ఆరుగురిని పట్టుకున్న ఎస్‌టీఎఫ్ అధికారులు



పట్టుబడిన గంజాయి విక్రేతలతో ఎస్‌టీఎఫ్ బృందం, ఎక్సైజ్ పోలీసులు


హోలీ వేడుకల్లో మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి తదితరులు

## ఘనంగా హోలీ సంబరాలు

**తార్నాక, మార్చి 14 ప్రభాతవార్త :** తార్నాక డివిజన్‌లో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. హోలీ వేడుకల్లో చిన్నపెద్ద అనే తారతమ్యం లేకుండా యువతీ, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సహాలతో కేరింతలు కొట్టారు. తార్నాకలోని మాజీమేయర్ బండ కార్తిక రెడ్డి నివాసంలో నిర్వహించిన వేడుకల్లో బిజెపి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా బండ కార్తికరెడ్డి ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బండ చంద్రారెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, సుబ్బు, రమేష్, సాంబశివ, బిజెపి నాయకులు మల్లి కంటి వీరన్న, కొన్నె సంపత్, మునిస్వామి, చరణ్ రాజ్, కిరణ్ కుమార్, బండ శివారెడ్డి, రాజ్ కుమార్, నరహరి, బబ్లూతో పాటు తార్నాక లేబర్ అడ్డా నాయకులు శ్రీను, రాజు, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## హోలీ వేడుల్లో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు


మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావును సన్మానిస్తున్న మేకల సారంగపాణి

**తార్నాక, మార్చి 14 ప్రభాతవార్త :** జీహెచ్ఎంసీ సిబ్బంది, బీజేపీ నాయకులతో కలిసి హోలీ వేడుల్లో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పాల్గొన్నారు. రాంచందర్‌రావుతోపాటు చిన్నపెద్ద అనే తారతమ్యం లేకుండా యువతీ, యవకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సహాలతో మునిగి తేలారు. ఈ వేడుకల్లో సికింద్రాబాద్ కంటెస్టడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, నాయకులు వెంకటేష్‌గౌడ్, సత్యనారాయణ, ప్రకాష్ గౌడ్, శ్రీధర్, రాముమర్మ, కరుణాకర్, హైమరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

### ఎమ్మెల్యేలు, మల్లారెడ్డి, మర్రి


హోలీ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి

**కంటోన్మెంట్, మార్చి 14 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని మేడ్చల్, మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేలు సిహెచ్. మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. హోలీ సంబరాలను పురస్కరించుకొని శుక్రవారం బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి నివాసంలో నిర్వహించిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ బోర్డు మెంబర్ పాండుయాదవ్, బోయిన్ పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎస్.శ్రీనివాస్, బిఆర్ఎస్ యువనేతలు టింకూగౌడ్, అజయ్‌యాదవ్, రాజుయాదవ్, అరుణ్‌యాదవ్‌తోపాటు వందలాది మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు తరలివచ్చి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 14 ప్రభాతవార్త:** హోలీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ శుక్రవారం యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలపై స్వామివారి ఆశీసు స్లు ఉండాలని, ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యాలతో ఉండాలని భగవంతున్ని వేడుకున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వేద పండితులు స్వాగతం పలికి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

## కంటోన్మెంట్‌లో హోలీ సంబరాలు


నర్మదకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి నేతలు

**కంటోన్మెంట్, మార్చి 14 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 6వ వార్డు బావన కాలనీలో నివాసం ఉంటున్న బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ నివాసంలో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి నర్మదమల్లికార్జున్‌కు శుభాకాంక్షలు తెలిపి రంగులు చల్లుకొని హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు బి.ఎస్.శ్రీనివాస్, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, చిన్న వీరయ్య, బానుక మల్లికార్జున్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుంది

### -ఎంఈవో సత్తు యాదవరెడ్డి

**చిన్నకోడూరు, మార్చి 14, ప్రభాతవార్త:** చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈవో సత్తు యాదవరెడ్డి అన్నారు. మండలపరిధిలోని కమ్మర్లపల్లిలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఆయనపాల్గొని మాట్లాడారు. గ్రామంలోని ప్రతివిద్యార్థి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వపాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులతోపాటు నాణ్యమైనవిద్య అందుతుందన్నారు. హెచ్ఎం పానుగంటి నరసింహాచారి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, రాజు, ఉపాధ్యాయులు రామకృష్ణ, రేణుకు, దీప్తి, మమత, అమ్మద ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, మాజీ ఎస్ఎంసి చైర్మన్ యాదగిరి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘాన్సీబజార్ డివిజన్‌లో రోడ్లు అధ్వానం

### ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


గుంతలు మయంగా మారిన రాణి సతీ మందిరం రహదారి

**చార్మినార్, మార్చి 14 ప్రభాతవార్త:** చార్మినార్‌కు దగ్గరలో ఉన్న ఘాన్సీ బజార్ డివిజన్‌లో వందలాది వస్త్రాలు దుకాణాలతో పాటు బంగారు దుకాణాలు, నగలు తయారుచేసే చిన్న, చిన్నషాపులు ఉన్నాయి. ప్రతీ రోజు ఘాన్సీ బజార్‌లోని మార్కెట్లు కొనుగోలు దారులతో ఎంతో రద్దీగా ఉంటాయి. జంట నగరాలలోని పలు ప్రాంతాలు నుంచి ఘాన్సీ బజార్‌లోని షాపులలో కొనుగోలు చేయటానికి వస్తుంటారు. ఘాన్సీ బజార్ డివిజన్‌లో కోట్లాది రూపాయల వ్యాపారాలు జరుగుతుంటాయి. డివిజన్ పరిధిలోని అన్ని రహదారులు రద్దీగా కనిపిస్తాయి. ఘాన్సీ బజార్ డివిజన్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఉంది. హైకోర్టుకు తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు చెందిన ఎంతో మంది ప్రజలు పనుల మీద వస్తుంటారు. కాగా డివిజన్ పరిధిలోని రహదారులు చెడిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై జిహెచ్ఎంసి అధికారులకు పలుమార్లు డివిజన్ ప్రజలు ఫిర్యాదులుచేసినా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. స్థానిక బబ్రీ హల్వా బస్తీ రోడ్డు గుంతలు మయంగా మారింది. రోడ్డుపై కంకర రాళ్ల తేలి ఉండటంతో స్థానిక బస్తీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిలో వాహనాలు అదుపు తప్పి తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. నడిచి వెళ్లె ప్రజలు గుంతలో జారి పడి గాయాల పాలవుతున్నారు. బబ్రీ హల్వాలోని రోడ్డు పరిస్థితి ఎన్నో నెలలు నుంచి చాలా అధ్వాన్నంగా ఉన్న కనీసం మరమ్మతులు కూడ చేయటం లేదని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నిధులు రాగానే రహదారికి మరమ్మతులు చేస్తామని అధికారులు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఘాన్సీ బజార్ డివిజన్‌లోని ఝూలా బస్తీలో శ్రీ రాణి సతీ దాది మందిరం ఉంది. నిత్యం మహిళలు మందిరంలో పూజలు నిర్వహించటానికి దూర ప్రాంతాలు నుంచి వస్తుంటారు. ఝూలా బస్తీలో దాదాపు సంవత్సరం క్రితం రోడ్డును తవ్వారు. తిరిగి రహదారికి మరమ్మతులు చేయలేదు. చౌరస్తా నుంచి రాణి సతీదాది మందిరం, మాజీ కార్పొరేటర్ నివాసంమీదుగా మైదానం వరకు రోడ్డు గుంతలు మయంగా మారింది. ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని పలుచోట్ల రహదారులు చెడిపోయి ఉన్నాయి. డివిజన్‌కు చెందిన వ్యాపారులు ప్రజలు కోట్లాది రూపాయల పన్నులు చెల్లిస్తున్నన్న అధికారులు మాత్రం వసతులు కల్పించటం లేదని డివిజన్ ప్రజలు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఘాన్సీ బజార్‌లోని రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మహిళా బిల్లులో బిసిలకు సబ్‌కోటా కల్పించాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**ముషీరాబాద్, మార్చి 14, ప్రభాతవార్త:** మహిళా బిల్లులో బీసీలకు సబ్‌కోటా కల్పించాలని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రెడ్ హిల్స్‌లోని ప్యాప్సీ హౌస్‌లో సగర ఉప్పర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 94 మంది మహిళలు చట్టసభలలో అడుగుపెడితే అందులో 54 మంది అగ్రకుల మహిళలని, 16 మంది ఎస్సీలు, 13 మంది ఎస్టీలు, నలుగురు మైనార్టీ మహిళలు ఉండగా కేవలం 8 మంది మాత్రమే బీసీ మహిళలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తెస్తున్న మహిళా బిల్లు వల్ల కూడా మెజారిటీగా ఉన్న బీసీ మహిళలకు ఎలాంటి ఉపయోగం లేదని, ఈ బిల్లు పూర్తిగా అగ్రవర్ణాలు లబ్ది పొందేందుకే తీసుకువచ్చారని ఆరోపించారు. బీసీ కమీషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు ముందడుగు వేసినప్పుడే మహిళలు అన్ని రంగాలలో రాణిస్తారని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. భగీరథుని వారసులుగా సగర జాతి ఔన్నత్యం కోసం సగర మహిళలు చేపడుతున్న అనేక కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. సమాజ నిర్మాణంలో కీలకమైన సగర జాతి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని కోరారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా గెజిటెడ్ హోదాలో పనిచేస్తున్న సగర మహిళా అధికారులను, వివిధ హోదాలలో స్వచ్ఛంధంగా సమాజానికి సేవలు చేస్తున్న సగర మహిళలను ఘనంగా సత్కరించారు. సగర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, నాయకులు వడ్లకొండ కుమారస్వామి సగర, ఆర్.బి.ఆంజనేయులు సగర, సగర భగీరథ ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ అస్కాని మారుతి సగర, యాదాద్రి భగీరథ సగర ఉప్పర అన్నదాన సత్రం అధ్యక్షులు కే.పి.రాములు సగర, మహిళా నాయకులు తంగడపల్లి పల్లవి, అతినారపు విజయలక్ష్మి, సూర జయమ్మ, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణి మంజరి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న చిక్కా దేవదాసు

## చేనేతలకు బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలి

### చేనేత వర్గాలు చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు

**చిక్కడపల్లి, మార్చి 14 ప్రభాతవార్త:** చేనేతలకు రాష్ట్ర బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయిం దాని వేనేత వర్గాలు చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. శుక్రవారం చేనేత వర్గాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ చిక్కా దేవదాసు మాట్లాడుతూ చేనేత మగ్గాన్ని సీఎం రేవంత్రెడ్డి అవమానపరిచారని తక్షణమే క్షమాపణలు తెలపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చేనేతకు రూ.2వేల కోట్లు బడ్జెట్లో ప్రవేశపెట్టి తక్షణమే అమలు చేయాలని, ప్రకటించిన 33 కోట్ల రుణమాఫీ వెంటనే అమలయ్యే విధంగా జీవో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2018 ఏప్రిల్ 17న బెస్కో మనుగడలో ఉండగానే కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని.. సుదీర్ఘ కాలంగా సొసైటీలు డైరెక్టర్లు పాలకవర్గాలతో కళకళ రాడిన సంస్థను పాలకులు ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మత్యకార వ్యవసాయ పరపతి సంఘాలు పనిచేస్తున్నాయని అవన్నీ కొనసాగుతున్నప్పుడు చేనేత, నేత కార్మిక సహకార సంఘాలపై ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ప్రభుత్వా న్ని నిలపీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని హెచ్చరించారు. చేనేత వర్గాలకు పూర్తి మద్దతు తెలిపిన తీన్మార్ మల్లన్న చేనేత వర్గాలకు పూర్తి అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్సీ సమావేశాల్లో చేనేత సమస్యలపై మాట్లాడుతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బల్ల గీత, కూరపాటి సుమలత, చింతకింది సుజాత, బొమ్మ నరేందర్ పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ రాజేంద్రనాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్వీ నేతలు

## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఒయులో భారీ ర్యాలీ

**తార్నాక, మార్చి 14 ప్రభాతవార్త :** తెలంగాణ తొలి సిఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉస్మాని యాయూనివర్సిటీ పోలీస్‌స్టేషన్లో బీఆర్ఎస్వి నాయకులు ఫిర్యాదు చేశారు. ఒయూ ఇఫ్లూచౌరస్త రోడ్డుపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వి నాయకులు అరెస్టు చేసి లాలాగూడ స్టేషన్ కు, చిలకలగూడ పోలీస్ స్టేషనలకు పోలీసులు తరలించారు. ఈ సందర్బంగా గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్‌ను పట్టుకొని మార్చురికి పంపిస్తా అంటావా కేసిఆర్ హత్యకు పన్నాగంపన్నావు కనుకే మార్చురి అని మాట్లాడ్తున్నావు తక్షణమే రేవంత్‌రెడ్డి కేసీఆర్ కుటుంబానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మార్చురికి దేనికోసం పంపుతావు రేవంత్‌రెడ్డి నువ్ ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయమన్నందుక లేక 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వమని యువత పక్షాన ప్రశ్నించినందుకా అన్నారు. గురుకుల విద్యార్థుల మరణాలు గురుంచి మాట్లాడినందుకా లేక మెడికల్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని అడిగినందుకా అన్నారు. యూనివర్సిటీ సమస్యలపై ఊసెత్తినందుకా నిరుద్యోగ భృతి పై నిలదీసినందుకు మార్చురికి పంపిస్తావా అన్నారు. రేవంత్ గుర్తుపెట్టుకో ఈరోజు నువ్వు కూర్చున్న ముఖ్యమంత్రి పీఠం కేసీఆర్ కొట్లాడి సాధించిందనేది గుర్తుపెట్టుకో అన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ప్రకటించిన గ్యారెంటీలు అమలుచేయి ముందు అడ్డగోలు మాటలు కాదు కెసిఆర్ పైన బీఆర్ఎస్ పార్టీ పైన అడ్డగోలుగా మాట్లాడితే ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కిరణ్ గౌడ్, వేల్పుల వెంకట్, దశరథ్ జంగయ్య, ,రమేష్ గౌడ్, ప్రశాంత్, నరేష్, శ్రీను నాయక్, రామకృష్ణ, శ్రీమాన్ నాగేందర్, నాగరాజు. అవినాష్, శ్రీకాంత్ రాహుల్, సాయి, విశాల్, కిరణ్, రెహామాత్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ మహాధర్నాతో దద్దరిల్లిన కుత్బుల్లాపూర్

### మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీ సస్పెన్షన్‌ను నిరసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం


ఆందోళన కారులను తరలిస్తున్న జీడిమెట్ల పోలీసులు

**కుత్బుల్లాపూర్, మార్చి 14 ప్రభాతవార్త** అసెంబ్లీలో బిఆర్ఎస్ శాసనసభ్యులు, మాజీమంత్రి జగదీశర్‌రెడ్డి సస్పెన్షన్‌కు నిరసనగా కుత్బుల్లాపూర్ శ్రేణులు భగ్గుమన్నాయి. కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వందలాదిగా శుక్రవారం రాస్తారోఖో నిర్వహించి ప్రభుతన వ్యతిరేక నినాదాలు చేస్తూ రాస్తారోఖో, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం నిర్వహించనడంతో పెద్దఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జీడిమెట్ల పోలీసులు భారీగా చేరుకుని ఆందోళనకు దిగిన ఆందోళన కారులను అదుపులోకి తీసుకుని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, ఉద్యమకారులు కస్తూరి బాల్‌రాజ్, సంపతి మాధవరెడ్డి, గుమ్మడి మధుసూధన్‌రాజు, డాక్టర్. హుస్సేన్, మక్సూద్ అలీ, గుబ్బల లక్ష్మినారాయణ, సమ్మయ్య నేత, ఫాక్స్‌సాగర్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, చింతల్ డివిజన్ మైనార్టీసెల్ టిఆర్ఎస్ అధ్యక్షులు ఎం.డి. మక్సూద్, సుభాష్‌నగర్ నాయకులు నదీమ్‌రాయ్, పరుశ శ్రీనివాస్‌యాదవ్, కైసర్ నగర్ మక్సూద్, బి.కార్తీక్‌గౌడ్, శ్రీశైలం యాదవ్, ఏసు, నవాబ్, బండ మహేందర్, జగద్గిరిగుట్ట ఆలయ మాజీ చైర్మెన్ వేణుయాదవ్ లతోపాటు వందలాది భారతరాష్ట్ర సమితి కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వమించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఆరు గారెంటీల అమలులో విఫలమైన ప్రభుత్వం ప్రతిపక్షం గొంతునొక్కేందుకు నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రశ్నించిన మాజీమంత్రి జగద్వీశర్‌రెడ్డిని సస్పెండ్‌చేయిందని ఆందోళన వ్యక్తంచేశారు. గవర్నర్‌ద్వారా పచ్చి అబద్దాలను ప్రచారం చేస్తున్నతీరును నిలదీసిన శాసనసభ్యులు, మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డిని అకారణంగా సస్పెండ్‌చేశారని విమర్శించారు.

## మహిళలు స్వయం సహాయకులుగా ఎదగాలి

### కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహులు

**కుత్బుల్లాపూర్, మార్చి 14 ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా అభివృద్దిలో భాగస్వాములు కావాలనేదే ప్రభుత్వ లక్ష్యమని కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహులు అన్నారు. సర్కిల్ కార్యాలయ ఆవరణలో పెద్దఎత్తున నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన మేడ్చల్ మాల్కాజ్‌గిరి జిల్లా ప్రాజెక్టు అధికారి హిమబింధు, సహాయకమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ప్రాల్గొన్నారు. ఈసందర్బంగా కుత్బుల్లాపూర్ మహిళా సమాఖ్య నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సమావేశంలో వివిధ విభాగాలోని జీడిమెట్ల పోలీసు సబ్ఇన్‌స్పెక్టర్ తలారి తేజశ్రీని సత్కరించారు. మహిళా పొదుపు సంఘ బలోపేతం గ్రూపులోని ప్రతిఒక్కరూ తమవ్యక్తిగత బాధ్యతగా భావించి నిర్వహించాలన్నారు. పొదుపు రుణాలను తీసుకున్నప్పటినుండి వాటిని సకాలంలో చెల్లించే బాధ్యతను ప్రతిమహిళ చేపట్టడంద్వారా ప్రభుత్వానికి, కుటుంబానికి బాసటగా నిలిచే అవకాశం ముంటుందన్నారు. జీడిమెట్ల పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ తలారీ తేజశ్రీని ఈసందర్బంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రాజెక్టు అధికారి హిమబింధుతోకలిసి సత్కరించారు. కుత్బుల్లాపూర్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.పద్మ, మహిళా సమాఖ్య నిర్వాహకులు ఇందిరారెడ్డి, శ్యామల, పొపూరి అనిత, చెరకు లావణ్య లతోపాటు కుత్బుల్లా పూర్ మున్సిపల్ సర్కిల్ పొదుపు సంఘాల నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

## వాడవాడల్లో హోలీ వేడుకలు


హోలీవేడుకల్లో పాల్గొన్న భజరంగ్‌సేనా అధ్యక్షుడు లక్ష్మన్‌రావుగుప్త

**అఫ్జల్‌గంజ్, మార్చి 14 ప్రభాతవార్త:** హోలీ పండుగ వేడకలను శుక్రవారం వాడ, వాడలల్లో యువతీ, యువకులు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో హోళిపండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎంతో ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. హోలీ వేడుకల్లో తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త కుటుంబ సభ్యులతోపాటు సేనా ప్రతినిధులతో కలిసి రంగులు చల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, మమత, కీర్తి, కిరణ్, అమన్, అచ్చుల్ తదితరులు పాల్గొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని అబిడ్స్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్, షాహినాయత్ గంజ్, సుల్తాన్‌బజార్, మంగళ్‌హాట్, హబీబ్‌నగర్ తదితర పోలీస్ స్టేషన్ల ప్రాంతాలలోని చౌరస్తాలలో పోలీసు పికెట్లు ఏర్పాట్లు చేశారు. జరిగే కాముని దహనం జరిగే ప్రాంతాలలో కూడా పోలీసు పికెట్లను నియమించారు.

## మహిళా దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

### టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే నాయకులు

**ముషీరాబాద్, మార్చి 14, ప్రభాతవార్త:** ఈనెల 16వ తేదీ చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజేల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘాల నాయకులు మామిడి సోమయ్య, బి.బసవ పున్నయ్య, బి.అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ వేడుకలలో జర్నలిజం–మహిళలు–సవాళ్ల అనే అంశంపై సెమినార్ ఉంటుందని తెలిపారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిధులుగా ఓయూ జర్నలిజం శాఖ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా, ఎన్‌డి టీవీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి ఉమాసుధీర్ హాజరవుతారని, విశిష్ట అతిథులుగా సీనియర్ జర్నలిస్ట్ ప్రియాచౌదరి, తులసి చందు, స్వేచ్ఛ, సలీమ పాల్గొంటారని, టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షురాలు పి.రాధిక అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి మహిళా జర్నలిస్టులు, హెచ్‌యూజే నాయకులు పి.నాగవాణి, పి.విజయ, మణిమాల, రోజారాణిలు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తారని వివరించారు. ఈ వేడుకలలో భాగంగా వివిధ పత్రికలలో, ఛానళ్లలో పనిచేస్తున్న సీనియర్ మహిళా జర్నలిస్టులకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా జర్నలిస్టులు పెద్ద ఎత్తున ఈ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కించపరిన బిఆర్ఎస్‌వి నేతలపై ఫిర్యాదు

**తార్నాక, మార్చి 14 ప్రభాతవార్త :** సీఎం రేవంత్‌రెడ్డిని కుక్క బొమ్మ చిత్రపటంతో కించపరిన బీఆర్ఎస్వీ నేతలపై ఒయుపిఎస్‌లో ఎన్ఎస్‌యుఐ నాయకులు ఫిర్యాయదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజేంద్రనాయక్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి, సీనియర్ కాంగ్రెస్ నేత మానవతరాయ్, ఉస్మానియా ఎన్ఎస్‌యుఐ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా ఎన్ ఎస్ యుఐ అధ్యక్షులు యడవల్లి వెంకట స్వామి మాట్లాడుతూ గురువారం ఉస్మానియా విశ్వ విద్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్వీ నేతలపై మండిపడ్డారు. టిఆర్ఎస్వి నేతలకు ఇంజక్షన్లు ఇవ్వడం మాత్రమే వస్తది అదే మా చేతులకు పని చెప్తే మేము సమర్థవంతంగా ఆపరేషన్లు కూడా చేసి ముదిరిన పిచ్చిని తగ్గిస్తం అన్నారు. ఇప్పటికైనా చిల్లర చేష్టలు మానుకొని సక్రమంగావుంటే గౌరవప్రదంగా వుంటుంది లేని ఎడల తీవ్ర పరిణామాలకు చోటు చేసుకోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రిని కించపరిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యుఐ ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు వెంకట్ ముదిరాజ్, వంశీరెడ్డి, నందు, రాజు, నాగరాజు, విద్యార్థులు, జెఏసి నేతలు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ రాజేంద్రనాయక్‌కు ఫిర్యాదుచేస్తున్న ఎన్ఎస్‌యుఐ నేతలు

## 63వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

**శంకర్‌పల్లి, మార్చి 4, ప్రభాతవార్త:** తమ భూములు తమకు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ కొండకల్ తండావాసులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 63వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్బంగా దీక్షలో కూర్చున్న పలువురు గిరిజనులు మాట్లాడుతూ గత 63 రోజులుగా రిలే దీక్షలు చేస్తుంటే అధికారులకు పాలకులకు పట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు. గిరిజనుల భూములను అపర్ణ గ్రీన్ మార్క్ రియల్ ఎస్టేట్ కంపెనీలు, విక్రంరెడ్డి లాంటి భూస్వాములు కబ్జా చేసి బాధితుల మీదనే అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతుంటే స్పందించకపోవడం దారుణమన్నారు.


IN THE COURT OF HON'BLE
II ADDL. JUNIOR CIVIL
JUDGE::M.M DIST;
AT : KUSHAIGUDA
O.S.No. 148 of 2025

BETWEEN:-
Smt.Mrunalini Gade and others
...Plaintiffs
AND
Tha Mandal Tahsildar Kapra and another
...Defendants

To
All Concerned
The General public hereby informed that Smt. Mrunalini Gade and others have filed Suit for Declaration of Legal Heirs to declare the plaintiffs are the legal heirs of Late SANDEEP SUBASH GADE who was died on 15-01-2024. The case is posted for any claims are objections on **20-03-2025** from any concern. Hence if any person is/are having any claims/objections they may appear before this **Hon'ble II Addl. Junior Civil Judge :: AT KUSHAIGUDA on 20-03-2025 AT 10:30 AM** failing which the matter will be decided on the material available.

**// BY ORDER OF THE COURT //**
Sd/-
**PENCHALA SURENDER RAO**
**YATA BHASKAR MUDIRAJ**
**ADVOCATES**
H.No. LIG - 97, TSIIC Colony,
Post: ECIL, Hyderabad - 062.
Cell No.:7997444488

## ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తుంది



మాజీ మంత్రి హరీష్ రావు కృష్ణ గొల్లూరి అంజయ్య బృందం...

**కుషాయిగూడ,మార్కెట్ 14, ప్రభాతవార్త...** తెలంగాణ ప్రజల సంక్షేమానికి టిఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావలసిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.హోలీ పండుగ సందర్భంగా అమీర్పేట్ డివిజన్ కార్పొరేటర్ తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గొల్లూరి అంజయ్య బృందం మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావును నానకురామ్ గూడ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకె అందజేసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుండి తెలంగాణ ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తప్ప సంక్షేమం పట్ల శ్రద్ధ లేదని ఆరోపించారు.

## మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 14 ప్రభాతవార్త:** నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ ఉండగా నిలుస్తుంది దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలో కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి దేంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు.

## సినీ దర్శకుడు పిసి ఆదిత్యకు ఉప్పల సత్కారం



ఆదిత్యను సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మార్చి 14 ప్రభాతవార్త:** సినీ దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్యకు మహాత్మాగాంధీ స్మారక పురస్కారం అందుకున్న సందర్భంగా నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో టీపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త శాలువాకప్పి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ..నిత్య ప్రయోగశిలి, విలక్షణ దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్యకు పురస్కారం వరించడం అభినందనీయమన్నారు. బువనేశ్వర్ ఒడిస్సాకు చెందిన ప్రముఖ సేవా సంస్కృతిక సంస్థ ఫేమస్ పీపుల్ ఇండియా వారు దర్శకుడు ఆదిత్యను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి మహాత్మా గాంధీ స్మారక విశిష్ట వ్యక్తిగా అవార్డును అందుకున్న సందర్భంగా గురువారం ఆదిత్యను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా సినీ రంగంలో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు రూపొందించి, నూతన కళాకారులను ప్రోత్సహిస్తున్న ఆదిత్య సినీ రంగానికి మరిన్ని సేవలు అందించి అవార్డులు అందుకోవాలన్నారు.

## ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్, గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి, పాఠశాల ఛైర్మన్

**సరూర్‌నగర్, మార్చి 14 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ ఓల్డ్ గాయత్రీనగర్‌లోనున్న మెగాసిటీ గ్రామర్ హై స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఛైర్మన్ కెవిఆర్ మూర్తి, కరస్పాండెంట్ సంధ్యా మూర్తిల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వందలాది ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన తల్లిదండ్రులు తదితరులకు విద్యార్థులు చక్కగా వివరించారు. పాముల పట్ల అవగాహన కోసం పాఠశాల యాజమాన్యం నిర్వహించి స్నేక్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదే విధంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అయితే సైన్స్ ఎగ్జిబిషన్‌కు, గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక మాజీ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి, ఆస్ట్రోలిస్టు రజితలు వివిధ తరగతుల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యమాలకు ఊపిరిలు ఊదిన సిపిఐ: కృష్ణ

**ఎల్.బి.నగర్, మార్చి 14 ప్రభాతవార్త:** పేద ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా సిపిఐ పార్టీ 100 సంవత్సరాలుగా ఉద్యమాలకు ఊపిరి పోసిందని మేడ్చల్ జిల్లా సిపిఐ సభ్యుడు బొడ్డుపల్లి కృష్ణ పేర్కొన్నారు. న్యూనాగోల్ ఎస్సేడాంగే భవన్లో ఉడతల మల్లేష్ అధ్యక్షతన జరిగిన కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ శాఖ సిపిఐ పార్టీ సభ్యులకు నూతన సభ్యత్వం కార్డులను ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి, దేశం నలుదిక్కుల ప్రజాపోరాటాలకు శ్రీకారం చుట్టి, నేటికీ మొక్కవోని దీక్షతో ఎర్రజెండా నీడ కింద శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, కార్మిక రాజ్యం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, బరిగేలా కృష్ణ, సుగుణ, రవి, హైమద్, మధు, జగన్, ఇశ్వర్ పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ సంబరాలు



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు చిలుక మధురఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాసవికాలనీలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు.



గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హోలీ పండుగ వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్‌కుమార్, కేశవ్‌నాయక్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, రూపులాల్, నారాయణ, సతీష్, టీంకు, గిరీష్, శశాంక్, రవి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికుల మధ్య హోలీ సంబరాలు జరుపుకుంటున్న రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



హోలీ ఆడుతున్న మాతృదేవోభవ మానసిక దివ్యాంగులు



సలీంనగర్‌లో హోలీ వేడుకలలో పాల్గొన్న చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి , టి పి సి సి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్



ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న యువతీ, యువకులు దృశ్యం.



ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న యువతీ, యువకులు దృశ్యం.



ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న యువతీ, యువకులు దృశ్యం.



హోలీ వేడుకలలో పాల్గొన్న మహిళలు



ఏ.పి.ఆర్.విల్లాస్‌లో హోళీ వేడుకలలో చిన్నారులు.



హోలీ వేడుకలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, దండెం రాజశేఖర్ రెడ్డి, బొక్క గోవర్ధన్ రెడ్డి తదితరులు



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప్పల్ బిఆర్ఎస్ నేతలు

## ఒత్తిడికి లోనుకాకుండా టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయాలి: తీగల విక్రంరెడ్డి



టెన్త్ విద్యార్థులకు స్టేషనరీని అందజేసిన మీర్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 14 ప్రభాతవార్త:** పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను చక్కగా రాసి ఉత్తమ ఫలితాలు పొందాలని మీర్‌పేట్ మున్సిపల్ కారొ ్పరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ యాదవ్ ఉచితంగా అందజేసిన పరీక్ష ప్యాడులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విక్రంరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దనీ సూచించారు. ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విక్రంరెడ్డి సూచించారు. పరీక్షల్లో స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు లార్డ్స్ వాగ్దేవి జూనియర్ కాలేజీలో ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తామని లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్, కాలేజీ ఛైర్మన్ సిద్దాల బీరప్ప అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సిద్దాల లార్డ్స్ బీరప్ప, దోమలపల్లి ధనలక్ష్మి రాజ్‌కుమార్, మాదరి సురేఖ రమేష్, సిద్దాల పద్మ అంజయ్య, లయన్ సురసాని సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి జె.శ్రీనివాస్ నాయక్, దయానంద్ ముదిరాజ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బలరాం, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: శ్రీధర్ రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దాహనం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మంచి కంటి జగన్ గుప్త తదితరులు

**మలక్ పేట , మార్చి 14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షే మాన్ని విస్మరిస్తుందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, అక్బర్ బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు మంచికంటి జగన్ గుప్తాలు పేర్కొ న్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ అక్బర్ బాగ్ చౌరస్తా వద్ద వారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజల సమస్యలను లేవనె త్తిన ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడం సమంజసం కాదని, నిరంకుశ పాలన కు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఉందా, ప్రజాపా లన కొనసాగుతోందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడం సమంజసం కాదు: పగిళ్ల నర్సింగ్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పగిళ్ల నర్సింగ్, బాబు సుదర్శన్ తదితరులు

**మలక్ పేట ,మార్చి 14, ప్రభాతవార్త :** అసెంబ్లీ సమావేశాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పగిల్ల నర్సింగ్ ఆధ్వర్యంలో మలక్ పేట నల్గొండ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగిందని తెలిపారు. జగదీశ్వర్ రెడ్డిని అరెస్ట్ చేయడం నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు సుదర్శన్ , సాయ భువనేశ్వరి, శ్రీధర్ రెడ్డి, వెంకటేష్, అమర్ నాథ్ గౌడ్, చుక్కా కృష్ణ, యాదగిరి, శ్రీకాంత్, వేణు, జగన్, సాయి, నవజీత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ సత్యదేవుని కళ్యాణోత్సవం



శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, మార్చి 14 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహోత్మవ్సాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు అభిషేకం, సేవాకాలం, హోమం, బలిహరణం, శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వారి తిరుక్కళాణోత్సవము వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, హోమము, బలిహరణం, తీర్థప్రసాద గోష్టి, గరుడ వాహనసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి, డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్‌గుప్త, నారాయణదాసు, ఆలయ కమిటి ట్రస్టీ కోట్ల నరసింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి విజయభారతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా శనివారం ఆలయంలో ఉదయం సేవాకాలం, ఆరగింపు, ప్రసాద వినియోగం, హోమం, బలిహరణము,శ్రీ సుదర్శన నారాసింహాఇష్టి, ఆరోగ్య, ఐశ్వర్యం, హోమం, బలిహరణం, శ్రీవారి గజవాహన రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదిన ఉదయం సేవాకాలం, హోమం, బలిహరణం,మహాపూర్ణాహుతి, అష్టోత్తర శతకళశాభిషేకం, శ్రీ పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, చంద్రప్రభ వాహనసేవ, అనతంరం దేవతా విసర్జన, శ్రీ స్వామి వారికి డోలోత్సవం, పండిత సన్మానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ అభివృద్ధి విషయంలో కార్పొరేటర్ పద్ధతి మార్చుకోవాలి



**మన్సూరాబాద్, మార్చ్ 14, ప్రభాతవార్త:** అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయడం స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి కి అలవాటుగా మారిందని వెంటనే ఆయన పద్ధతి మార్చుకోవాలని మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి హితవ్ పలికారు .డివిజన్ లోని కె.బి.ఆర్.ఫంక్షన్ హాల్ లో జరిగిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రోటోకాల్ ప్రకారం బుధవారం జరిగిన అభివృద్ధి కార్యక్రమాల విషయాలు అధికారులు స్థానిక కార్పొరేటర్ కు చెప్పారా లేదా అని ప్రశ్నించారు.ఇదే అధికారులచే ప్రతిరోజూ పనులు చేయించుకునే నీవు.అలాంటిది శంకుస్థాపన కార్యక్రమం విషయంలో ఫోన్ చేసి చెబితే దానిని వేటకారంగా మాట్లాడిన తీరు గత నాలుగున్నర సంవత్సరాల్లో ఎవరు ఎక్కడ నుంచి ఎంత నిధులు తెచ్చారో పోటీ పెట్టుకుందామని సవాలు విసిరారు .ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దాదాపు 95 అభివృద్ధి పనులు చేయిస్తే కొప్పుల నర్సింహారెడ్డి కేవలం 5 శాతం మాత్రమే అభివృద్ధి చేసిన మాట వాస్తవం కాదా అని అన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మన్సూరాబాద్ నియోజకవర్గ పరిధిలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన విషయం లో అధికారులు,కాలనీవాసులు కార్పొరేటర్ కు సమాచారం ఇచ్చిన .మీరు రాకుండా ఎమ్మెల్యే మీద నిందలు వేయడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనం అని అన్నారు. కార్పొరేటర్ కు దమ్ముంటే మళ్ళీ శంకుస్థాపన ఎప్పుడూ చేస్తావో సమయం చెప్పాలని అట్టి ప్రదేశం,సమయంలో మేము కూడా వస్తాం అప్పుడు చూద్దామని ఆయన హెచ్చరించారు. .ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్,రుద్ర యాదగిరి ,జగదీష్ గౌడ్,వెంకన్న,నర్సింగ్ గౌడ్, చంద్రమోహన్,అంజి,ఈశ్వర్ పాల్గొన్నారు.

## కిడ్నీ సమస్యలకు కామినేనిలో అత్యాధునిక రోబోటిక్ చికిత్సలు



**మన్సూరాబాద్, మార్చి 14, ప్రభాతవార్త :** గడిచిన దశాబ్ద కాలంగా వయసుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు.. అన్ని వయసుల వారికీ కిడ్నీ సమస్యలు బాగా ఎక్కువ అవుతున్నాయని కామినేని ఆస్పత్రి యూరాలజీ విభాగం డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్. వి. సూర్యప్రకాశ్ అన్నారు. ప్రపంచ కిడ్నీడే సందర్భంగా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్యాకేజిని ఆవిష్కరించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు, మధుమేహం, నొప్పినివారణ మందులను అతిగా వాడడం, జీవనశైలిలో మార్పులు, జంక్ ఫుడ్, మాంసాహారాలు ఎక్కువగా తీసుకోవడం లాంటి కారణాల వల్ల ప్రధానంగా కిడ్నీ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయానీ కామినేని ఆస్పత్రిలోనే రోజుకు సుమారు 40 మంది వరకు కిడ్నీ సంబంధిత సమస్యలతో వస్తున్నారు అని తెలిపారు.ఇటీవలి కాలంలో కిడ్నీల్లో రాళ్లు, పలు రకాల కణితులు, ప్రోస్టేట్ సమస్యలు ఉంటున్నాయని కిడ్నీలు విఫలమైనవారికి ఇక్కడ అన్నిరకాల డయాలసిస్ సదుపాయాలు ఉన్నాయన్నారు.సీఎంఆర్ రోబో అనే అత్యాధునిక రోబో సాయంతో రోబోటిక్ శస్త్రచికిత్సలు కూడా ఇక్కడ చేస్తున్నామని తెలిపారు.ఇలాంటప్పుడు తగినంత నీరు తీసుకోకపోతే శరీరంలో క్రిస్టల్స్ ఏర్పడి, అవి చివరకు కిడ్నీల్లో రాళ్లుగా మారుతాయని ఈ సమస్య వేసవిలోనే ఎక్కువగా కనిపిస్తుందని అందువల్ల రోజుకు రెండు లీటర్ల మూత్ర విసర్జన జరిగేలా నీళ్లు తాగాలని రోగులకు సూచించారు.దాంతోపాటు ఆరంజ్, నిమ్మకాయ, దబ్బకాయ లాంటి సిట్రస్ జాతి ఫలాలను వీలైనంత ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, డాక్టర్.విష్ణు వర్ధన్ రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ డాక్టర్. ఎ. సంతోష్‌కుమార్ లు పాల్గొన్నారు.

## ఘనంగా కామ దహనం, హోలీ వేడుకలు

**సరూర్‌నగర్, మార్చి 14 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలంలో హోలీ, కామ దహన కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో గురువారం రాత్రి కామ దహనాలను నిర్వహించి శుక్రవారం హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్ బాలాజీనగర్, మున్సిపల్ కాలనీలలో జరిగిన కామ దహన కార్యక్రమాలకు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి హాజరయ్యారు.



కాముని దహనం చేస్తున్న బడంగ్‌పేట్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి

ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు సామ భాస్కర్‌రెడ్డి, కొండ శ్రవణ్‌కుమార్ యాదవ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.